
# తెరువు

**- టి.పి.హేమమాలిని**



శాంతమ్మ మనసంతా గజిబిజిగా ఉంది. కల్లోల సాగరం లాంటి ఆమె హృదయం లాగే ఆమె ఆలోచనలు కూడా బలమైన సునామీ అలల్లా గుండె తటిని తాకుతున్నాయి.

గమ్యం లేని ఆమె జీవితంలాగే ప్రయాణం చేస్తున్నాయి ఆమెలోని భావప్రకంపనలు.

శాంతమ్మ భర్తపోయి రెండు నెలలు కావస్తోంది. అతను ఉన్నప్పుడు చేసేదీ పెద్దగా ఆదాయం లేని ఒక ఆలయంలో అర్చకత్వం. అందుకే ఎన్నేళ్ళనుండో చేస్తున్నా జీవితంలో ఎదుగు, బొదుగు లేదు. దేవుడికి రోజూ నైవేద్యంగా వండిన అన్నం, పప్పుతో భార్య, ఇద్దరు పిల్లల్ని పోషించేవాడు. ధర్మకర్తలు దయతలచి ఇచ్చిన ఆలయాన్ని ఆనుకునే ఉన్న ఇంట్లో సంసారాన్ని నెట్టుకొచ్చాడు.

భక్తులు వారివారి శక్తినిబట్టివేసిన దక్షిణలతో ఎప్పుడైనా పాలు, కూరగాయలు కొనుక్కునేవారు. ఆ ఆలయానికి భక్తుల రాక చాలా తక్కువ.

అతను అర్ధాంతరంగా చనిపోయాడు. గుండెపోటుతో పోయాడని నిర్ధారించారు చుట్టుపక్కల వాళ్ళు.

అతను చనిపోయాక ఆ ఆధారం కూడా పోయింది. వేరే అర్చకుణ్ణి నియమించారు. మరో నెల రోజుల్లో అతను కుటుంబాన్ని తీసుకువస్తానన్నాడు. ఆసరికల్లా ఇంటిని ఖాళీచేయాలని చెప్పారు. తర్వాత ఏ దారి పట్టిపోవాలో తెలియడంలేదు శాంతమ్మకు. శాంతమ్మకి గడప దాటక తప్పలేదు. అవసరమైనచోట వండి పెడుతూ వారిచ్చే దాంతో తనకూ, పిల్లలకూ కడుపు నింపుకుంటోంది... ఈమధ్యే ఒక సంపన్నుల ఇంట్లో పనికి చేరింది. వారి బిడ్డలు విదేశాల్లో ఉంటారు. ఆ వృద్ధ దంపతులు ఏ పనీ చేసుకోలేరు. వారిని పొద్దుటనుంచి రాత్రివరకు కనిపెట్టాలి. ఉదయం తొమ్మిదవగానే వెళ్ళి వారికి వంట చేసి, భోజనాలు పెడుతుంది. ఇల్లు సర్ది మధ్యాహ్నం టీ, టిఫిని చేస్తుంది. రాత్రికి వారికేం కావాలో అది చేసిపెట్టి ఇంటికొస్తుంది. వాళ్ళు నెలకింతని ఇచ్చే జీతమేకాక అడపాదడపా అన్నం, కూరలు తెస్తుంటుంది. వాళ్ళు తీసుకెళ్ళమన్నా శాంతమ్మ ఇష్టపడదు. మంచితనాన్ని అతిగా ఉపయోగించుకోకూడదని ఆమె అభిప్రాయం.

శాంతమ్మ సంతానం శ్రీరామ్, వసంత. తను అర్చిస్తున్న రాముడి పేరే కొడుక్కి పెట్టుకున్నాడు శాంతమ్మ భర్త. శ్రీరామ్ ఇంటర్ చదివి ఆపేసాడు. డిగ్రీ చదవమని ఎంత పోరినా తనకింట్రస్టు లేదన్నాడు.

సినిమాలంటూ తిరుగుతాడు. అభిమాన హీరో అంటే పడి చస్తాడు. అభిమాన సంఘాల వెంట తిరుగుతాడు. తండ్రి పోయాకైనా తనే ఇంటిని నడపాలన్న ఆలోచన లేదు.

వసంత ఇంటరు రెండో సంవత్సరం చదువుతోంది. ఇంటరవగానే టీచర్ ట్రైనింగ్ చేసి ఉద్యోగం చేయాలని ఆ పిల్ల ఆశ. తన కాళ్ళమీద తాను నిలబడి తల్లి ఒంటి మీదకి మూడో చీర కొనాలని ఆమె ఆశయం. అందుకే ఇంటరు పరీక్షలతోపాటు డైట్‌సెట్‌కి కూడా ప్రిపేరవుతోంది.

"అమ్మా! అమ్మా!" శ్రీరామ్ వచ్చాడు. ఏమిటన్నట్లు చూసింది. "ఆకలేస్తోంది. అన్నం పెట్టు." కూచుంటూ అడిగాడు. "బియ్యం లేవురా! పెద్దమ్మగారు వాళ్ళు ఊరెళ్ళారు, డబ్బులడిగి కొందామన్నా ఉన్న నూకలతో గంజి కాచాను. తాగుతావా?"

"ఎప్పుడూ బీదరుపులే! ఎప్పుడుండి చచ్చింది అన్నం? సర్లే! ఆ గంజేపొయ్యి" ఆవకాయ వేసుకుని గంజి తాగాడు.

"శ్రీరామ్!" పిలిచింది. విసుగ్గా చూసాడు.

"నువ్వేదైనా చిన్నో, చితకో ఉద్యోగం చూసుకుని నాకూ, చెల్లికీ ఇంత తిండి పెట్టరా! నువ్వు పట్టించుకోకుండా తిరిగితే ఎలారా?" వణుకుతున్న కంఠంతో చెప్పింది.

"అబ్బబ్బ! ఎప్పుడూ అదే గోల. ఇవ్వాళ అసలే మా హీరో సినిమా యాభయి రోజుల పండుగ. అందరూ డబ్బు తీసుకుని దండలు కొన్నారు. పూలు చల్లారు. నేనే ఏమీ ఇవ్వలేకపోయానన్న బాధలో ఉంటే. ... ఇదో సొద!" అంటూ విసవిసా బయటకెళ్ళిపోయాడు.

"అమ్మా! ఎందుకమ్మా వాడితో చెప్తావు? పాడిందే పాడరా... అన్నట్లు! వాడేదో ఉద్ధరిస్తాడన్న ఆశ లేదు. ఆ మాత్రం దానికి నా నోరు వృధాకావడం తప్ప మరేం ప్రయోజనం లేదు. నా ఇంటర్ పూర్తవగానే ఏదో ఒకచోట పద్దులు రాసైనా నిన్ను పోషిస్తానమ్మా!" అంటూ ఏడ్చేసింది వసంత.

శాంతమ్మ కూడా కూతురిని కౌగిలించుకుని బావురుమంది.

❖ ❖ ❖

ముందు చెప్పినట్లుగానే కొత్త అర్చకుడు తన కుటుంబంతో వచ్చాడు. అంతకు రెండు రోజుల ముందే పక్క వీధిలో చిన్న గది అద్దెకు తీసుకుంది. అద్దె ఎలా కట్టాలో కూడా తెలియదు. భయవంతుడున్నాడనుకుని ధైర్యం చేసింది, రోడ్డుమీద పడలేక. ఆమె స్థితిని చూసిన ఇంటి వాళ్ళు ఆమెకో నీడనిచ్చారు.

శాంతమ్మ పాత ఇల్లు ఖాళీచేసే ముందు ఆలయ ధర్మకర్త వచ్చాడు. ఇలా చేయవలసి వచ్చినందుకు తనకు బాధగా ఉందనీ, కానీ తప్పదనీ మర్యాదగా చెప్పాడు. వెళ్ళేముందు పదివేల రూపాయల కట్టను ఆమె చేతిలో ఉంచి తను అంతకుమించి చెయ్యలేననీ, ఏదైనా ఉపాధి దొరికేవరకూ వీటితో జీవనం సాగించమనీ చెప్పాడు.

తిమిరం తెరలా కమ్మేసిన తమ జీవితాలలో ఆ నోట్లకట్ట చిరుదివ్వెలా కనిపించింది శాంతమ్మకు.

తను పాచిపన్లు చేసైనా ఆకలి తీర్చుకుని, ఆ డబ్బుతో కూతుర్ని చదివిస్తుంది. అవును! అదే తన ఆశ. వసంతను టీచర్ ట్రైనింగ్ చేయించేస్తే, తిరిగి చూసుకోనక్కరలేదు.

ఆపద్బాంధవుడిలా ధర్మకర్త ఇచ్చిన పదివేలతో తమ జీవితాలు స్థిరపడిపోయినట్లే!

శాంతమ్మ ఆ డబ్బుని జాగ్రత్తగా దాచిపెట్టింది.

"అమ్మా! నా దగ్గరున్న డబ్బులోంచి ఓ రెండువేలివ్వు. ఈరోజు మా హీరోగారి అబ్బాయి పుట్టినరోజు. అందుకని వృద్ధులకు పళ్ళు, మందులు పంచిపెడుతున్నాం. నా వంతుగా ఇవ్వాలి" అంటూ గబగబా చెప్పేసాడు శ్రీరామ్.

"ఒరే! అది చెల్లి చదువుకోసం ఉంచాను. దయచేసి అది మాత్రం ముట్టుకోకు." ప్రాధేయపడింది.

"అమ్మా! ఎంతసేపూ చెల్లి గురించే గానీ, నా గురించి ఆలోచించవా! నీ కొడుక్కి మంచి పేరు రావడం నీకిష్టం లేదా! చెల్లి చదువువేళకి నేను డబ్బిస్తాను. నాకు మంచి ఉద్యోగం వస్తుంది. చూస్తూండు".

కనీసం ఇంటరు కూడా పాసవనివాడికి మంచి ఉద్యోగం కాదుకదా, అసలు ఏ ఉద్యోగమైనా దొరకడం గగనమేనని తెలియనంత అమాయకురాలేం కాదు శాంతమ్మ.

కూతురి భవిష్యత్ కళ్ళముందు కదలాడింది. ఏమైనా సరే! డబ్బివ్వకూడదన్న తన నిర్ణయాన్ని ఖరాఖండిగా చెప్పేసింది.

అంతే! కోపంతో ఇంట్లో గిన్నె, ముంత ఏది దొరికితే అది కాలితో తంతూ విసిరేసాడు.

"అమ్మా! ఆ డబ్బులో నాకూ వాటా ఉంది. ఇస్తావా! లేదా!" అరిచాడు పెద్దగా.

శాంతమ్మ చేష్టలు దక్కి చూస్తోంది. ఇంతలో వసంత వచ్చింది.

"అమ్మా! దయచేసి ఇచ్చేయమ్మా! లేకపోతే ఈమాత్రం మనశ్శాంతి కూడా ఉండదు" అంది.

"నేనివ్వనే! ఇవాళ ఏదిఏమైనా ఇచ్చే పరిస్థితిలేదు. అది నీ చదువుకోసం ఉంచాను" నిశ్చయంగా పలికింది శాంతమ్మ.

ఆ మాట వినగానే మరింత రెచ్చిపోయాడు శ్రీరామ్. గట్టుమీదున్న బియ్యం డబ్బా తీసి గట్టిగా నేలకేసి కొట్టాడు. అందులో ఉన్న కాసిని బియ్యం చెల్లాచెదురయ్యాయి.

"అమ్మా! రేపటినుండే నాకు పరీక్షలు. ఇంటరయినా మంచి మార్కులతో పాసయితే తర్వాత చదువు సంగతి దేవుడెరుగు. నన్ను ప్రశాంతంగా చదువుకోనీమ్మా. ప్లీజ్!" కళ్ళంట నీళ్ళు ధారలు కట్టగా చెప్పింది వసంత. ఒక్క క్షణం ఆలోచించిన శాంతమ్మ చేసేది లేక డబ్బు తెచ్చి శ్రీరామ్‌కిచ్చింది. శ్రీరామ్ వెళ్ళిపోయాడు.

"తల్లీ, చెల్లీ పస్తులున్నా పట్టించుకోడు కానీ, పేదలకు పళ్ళు పంచుతాడట!" బాధ గుండెని మెలిపెడుతుండగా అనుకుంది.

❖ ❖ ❖

ఇంటరు పరీక్షలైపోయిన తర్వాత డైట్‌సెట్‌కు ప్రిపేరవుతుండగా వసంతకు విష జ్వరం దాపురించింది. ఆ వైద్యానికి గాను మరో రెండు వేలు ఖర్చయిపోయాయి. పిల్ల తేరుకోడానికి గాను మంచి ఆహారం పెట్టమన్నారు వైద్యులు. కరిగిపోతున్న హిమానీ నదాల వైనమైంది శాంతమ్మ దగ్గరున్న డబ్బు చందం.

జ్వరం తగ్గి వసంత కోలుకున్నా, మనిషి చాలా నీరసంగా ఉంది. పళ్ళ రసాలు, పాలు ఇచ్చి తేరదీసింది శాంతమ్మ. అంత జ్వరంలోనూ పుస్తకం వదలకుండా చదువుతూనే ఉంది వసంతి.

శ్రీరామ్ చాలా బిజీగా ఉన్నాడు. మరో రెండ్రోజుల్లో తన అభిమాన హీరోగారి కొత్త సినిమా విడుదల. ఎన్నో కోట్లు ఖర్చుపెట్టి ప్రతిష్టాత్మకంగా తీసిన సినిమా అది. అభిమాన సంఘాల తరఫున కటౌట్లు పెట్టడం, పోస్టర్లు అంటించడం, బ్యానర్లు కట్టడం లాంటి పనులతో అభిమానులంతా సందడిగా ఉన్నారు. సిన్మా రిలీజ్ ముందురోజు ప్రత్యేకంగా బెనిఫిట్ షో వేస్తున్నారు. ఆ షో టికెట్

ఖరీదు ఐదువందలుగా నిర్ణయించారు. ఆ షో ద్వారా వచ్చిన డబ్బుని అనాథ బాలల సంక్షేమానికై రెడ్‌క్రాస్‌కి అందచేస్తారు. అభిమానులంతా ఎగబడి కొన్నారు.

"శ్రీరామ్! నువ్వు టికెట్ తీసుకున్నావా?" అడిగాడో స్నేహితుడు. పెదవి విరిచాడు శ్రీరామ్.

"డబ్బుల్లేవురా! నువ్వు అప్పిస్తావా?" ఆశగా అడిగాడు.

"నా దగ్గరే మూడొందలుంటే రెండొందలు అప్పుచేసి కొన్నాను. సారీరా!"

అలా నలుగురైదుగురిని అడిగి చూసాడు. పెదవి విరిచిన వాళ్ళు కొందరైతే, వెటకారం చేసిన వాళ్ళు మరి కొందరు. నాల్రోజులాగి చూడమని సలహాఇచ్చారు కొందరు.

నిరాశ నిలువెల్లా కమ్మేసింది శ్రీరామ్‌ని. తన హీరో కొత్త సినిమా మొదటిరోజు చూడకపోతే ఏదోలా ఉంటుంది. అన్నం, నీళ్ళు సహించవు. తల్లినడుగుదామంటే ఎందుకోగానీ మనసు రావడం లేదు. ఎలా? అభిమానానికి కూడా డబ్బుండాలా?

సంఘం తరఫున ఎంతో సేవ చేసాడు. ఒక్కరూ టికెట్ కొనలేదు. కలత చెందిన మనసుతో ఏదో రాత్రివేళ ఇంటికి చేరాడు. తల్లి అన్నం తింటానికి పిలిచినా వెళ్ళలేదు. పడుకున్నాడు. మర్నాడే షో.

❖ ❖ ❖

షో మరో గంటలో స్టార్టవబోతోంది. థియేటర్ ముందు అభిమానుల హడావుడి ఇంతా అంతా కాదు. ఈలలు, చప్పట్లు, కేకలు... ఒకటే కోలాహలం. థియేటరంతా పూలు చల్లారు. కటౌట్లకి కొబ్బరికాయలు కొట్టారు. పెద్ద కటౌట్లనిండా దండలు వేసారు. హీరో కటౌట్లకి క్షీరాభిషేకం చేయడానికి నిర్ణయించారు. ఆ పని తాను చేస్తానని బతిమాలాడు శ్రీరామ్.

అంచెలంచెలుగా కటౌట్ మీదకి చేరాడు. కిందనుండి అందిస్తున్న పాలని అందుకుని అభిషేకం చేసాడు. ఏ దేవుడినో స్వయంగా అర్చిస్తున్న పూజారిలా సంబరపడ్డాడు శ్రీరామ్.

అభిషేకం పూర్తయ్యాక ఆఖరుగా పెద్ద గులాబీ పూలదండ వేస్తున్నాడు. మెడలో వేసి అక్కడనుండి ఒక చేతిలో దండ తగిలించి, మరో చేతిలో వెయ్యడానికి ముందుకు వంగాడు.

అనుకోని విధంగా అక్కడున్న కరెంట్ తీగలు తగిలి షాక్‌కొట్టింది. పెద్దగా అరుస్తూ కింద పడిపోయాడు. తల చిట్లింది. అక్కడికక్కడే చనిపోయాడు. జనమంతా గుమిగూడారు.

"హాస్పిటల్‌కి తీసుకెళ్తేసరి!" ఎవరో అన్నారు.

"ప్చ్! లాభం లేదండీ! స్పాట్ డెత్!"

అందరూ కలిసి ఇంటికి మోసుకొచ్చారు శవాన్ని. అంతటి దృశ్యాన్ని చూసి కూడా తన ప్రాణం ఇంకా ఎందుకుపోలేదో అర్థంకాలేదు శాంతమ్మకి. పిచ్చిదానిలా పెద్దగా అరుస్తూ గుండెలు బాదుకోసాగింది. తలనుండి ముఖం మీదకు కారిన రక్తం మరకలతో హృదయ విదారకంగా ఉన్నాడు శ్రీరామ్. చూసిన ప్రతిఒక్కరి హృదయం ద్రవించింది. తిరిగి రాని లోకాలకు తరలి వెళ్ళిపోయిన కొడుకు శవాన్ని అణువణువునా తడుముతోంది శాంతమ్మ.

"ఒరే నాన్నా! ఏదో ఒక పనిచేసి ఇల్లు గడపమని అనునిత్యం పోరేదాన్ని. ఆ పోరే నీకు శాపమైందిరా!" అంటూ గడపకేసి బుర్రకొట్టుకోసాగింది. చుట్టుపక్కలవాళ్ళు ఆమెని బలవంతంగా లోపలికి తీసుకెళ్ళారు. వసంత ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లింది. వీధిలో నలుగురూ తలో చెయ్యివేసి మిగతా కార్యక్రమాలు జరిపించారు.

❖ ❖ ❖

సంజవేళయింది. కరెంటు బిల్లు కట్టక కరెంటు తీసేసారు. మిణుకుమంటున్న దీపం బుడ్డీ వెలుగు తన జీవితానికి చిహ్నంలా అనిపించింది.

శ్రీరామ్ చనిపోయిన పది రోజుల్లోనే వసంతకి డైట్ సెట్ పరీక్ష జరిగింది. తను వెళ్ళలేనని, రాయలేనని అంది. కానీ ఆమె ఫ్రెండ్స్ బతిమాలి తీసుకెళ్ళారు. అనుకున్నట్లుగానే వసంతకి మంచి ర్యాంకు వచ్చింది. కానీ చదివే ధ్యారే లేదు. ఆ ఊసే ఎత్తక ఒక బట్టలకొట్లో సేల్స్ గర్ల్‌గా చేరింది. డిగ్రీకి కూడా కట్టలేదు. తల్లీ కూతుళ్ళకి ఇంత అన్నం నోట్లోకి వెళ్తోంది.

శాంతమ్మ శ్రీరామ్ చనిపోయిన దగ్గరనుండి ఒక పూటే తింది. కూతురికోసం బతికుండడానికి తింటోంది.

ఒకరోజు శ్రీరామ్ అభిమాన హీరో అభిమాన సంఘం తరఫున ఒక వ్యక్తి వచ్చాడు. తను వచ్చిన పని వివరించాడు.

"అమ్మా! మీ అబ్బాయి ప్రమాదవశాత్తు చనిపోయాడు కదా! అది కూడా సిన్మా రిలీజ్ సందర్భంగా జరిగింది. జరిగిన దానికి విచారిస్తూ మా హీరోగారు కొంత డబ్బు సహాయం చేయాలనుకుంటున్నారు, మీ కుటుంబానికి మరే ఆధారం లేనందున. ఆయన రేపు ఇక్కడ షాపింగ్ మాల్ ఓపెనింగ్‌కి వస్తున్నారు. మిమ్మల్ని నేను వచ్చి తీసుకెళ్తాను. మా సంఘం ఆఫీసులో మీకు డబ్బిస్తారు."

శాంతమ్మకు మాట రాలేదు. డబ్బా! తను కొడుకు సంపాదించి తెచ్చే పైసలతో గంజి తాగాలనుకుంది. కానీ బిడ్డ శవంమీది నోట్లకట్టలు తనకక్కరలేదు. అదే చెప్పిందతనితో.

"మీకేమీ ఆధారం లేదు కదమ్మా! ఈ డబ్బుతో చిన్న వ్యాపారం పెట్టుకోండి. భగవంతుడు ఇలా ఉపాధి ఏర్పరచాడనుకోండి" అంటూ అతను వెళ్ళడానికి సిద్ధపడ్డాడు.

అతనలా వెళ్ళగానే ఆకాశం ముసిరినవేళ ఎక్కడినుండో వచ్చి పడ్డ తూనీగల్లా చుట్టుముట్టాయి ఆలోచనలు శాంతమ్మను.

విషయం విన్న ఇరుగుపొరుగు వచ్చారు. ససేమిరా తీసుకోనన్న శాంతమ్మకు నచ్చచెప్పారు. పిల్లని చదివించవచ్చన్నారు.

మర్నాడు శాంతమ్మ, వసంత వెళ్ళి ఆ డబ్బందుకున్నారు. యాభై వేలిచ్చాడా హీరో.

ఆ డబ్బు చూసిన శాంతమ్మ కన్నీటికి ఆ నోట్లకట్ట తడిసి ముద్దవుతుందేమోననిపించింది చూసిన వారందరికీ.

తలవని తలంపుగా కొడుకు తెచ్చిపెట్టిన డబ్బుతో కూతురికి ఫీజు కట్టి టీచర్ ట్రైనింగ్‌లో చేర్పించింది. మంచి బట్టలు, పుస్తకాలు కొంది. కరెంటు సౌకర్యం ఉన్న మంచి ఇంట్లోకి మారారు.

వసంత కృషికి భగవత్సంకల్పం తోడవడంవలన ఆమె ట్రైనింగ్ పూర్తయింది.

ఆమె అదృష్టమో! ఏమో! రెండేళ్ళుగా లేని డిఎస్సీ ఆ ఏడాది నిర్వహించారు. ఆ డిఎస్సీలో వసంత సెలక్టయింది. శాంతమ్మ ఆనందానికి అవధులు లేవు. వసంతకు తూర్పుగోదావరి జిల్లాలో పోస్టింగ్ వచ్చింది. పోస్టుల సంఖ్యనిబట్టి ఆమె అక్కడే పరీక్ష రాసింది. రాజమండ్రిలో ఇల్లు తీసుకున్నారు.

బయల్దేరే సమయం దగ్గరపడుతోంది. అన్ని సామాన్లు సర్దుతున్నారు. అన్నేళ్ళుగా ఉన్న ఊరిని వదిలి వెళ్ళాలంటే చాలా బాధగా ఉంది శాంతమ్మకు.

"అమ్మా! అమ్మా! ఇలా రా!" గట్టిగా అరిచింది వసంత.

ఏమయిందోనన్న కంగారుతో వచ్చింది శాంతమ్మ.

"ఇదిగో ఇది చూడు" అంటూ వణుకుతున్న చేతులతో తల్లి చేతుల్లో ఒక కవరు పెట్టింది.

దానిమీద "అమ్మకు" అని, కవరు కిందన "శ్రీరామ్" అని రాసి ఉంది. కవరు తెరిచింది.

"అమ్మా! నువ్వీ ఉత్తరం చదివే సమయానికి, నువ్వు తిట్టినా వినిపించనంత దూరం వెళ్ళిపోతాడు నీ కొడుకు.

నన్ను ఎప్పుడూ ఏదో ఉద్యోగం చూసుకోమనేదానివి కదా! నా చదువుకి నేనేం ఉద్యోగం చేయలేను. అందుకే ఓ పని చేస్తాను.

నేను రేపు కరెంటు షాక్ కొట్టి చనిపోతాను. సినిమా రిలీజ్ సందర్భంగా జరిగిన సంఘటన కాబట్టి మీరు తప్పకుండా నష్టపరిహారం ఇస్తారు. ఆ డబ్బుతో నువ్వు, చెల్లి కొన్నాళ్ళైనా హాయిగా ఉండండి.. అన్నట్లు చెల్లిని చదివించు.

గతంలో ఇటువంటివి జరిగితే డబ్బిచ్చారు. అందుకే నా సంపాదనగా మీకివ్వాలని ఈ నిర్ణయం తీసుకున్నాను.

నాలో నాకే తెలియని వైరాగ్యం ఏర్పడింది. మా హీరో సినిమాకి ఐదువందలు పెట్టి టికెట్ కొనలేకపోయాను. అందరూ నన్ను ఉపయోగించుకున్నారుగానీ నాకెవరూ ఇవ్వలేదు.

ఈ అభిమానంలో పడి కొట్టుకుని నేనేం సాధించాను. నిన్ను ఉసురు పెట్టాను. ఎంత అభిమానం ఉన్నా దాన్ని ప్రకటించేందుకు డబ్బుకావాలి. నా వంతు నేనివ్వలేనని నన్ను పురుగులా చూసారు. నేనది తట్టుకోలేకపోయాను.

బతికి ఎవరికీ ప్రయోజనం లేదు. చచ్చి కనీసం మీకైనా ఉపయోగపడాలనుకున్నాను.

నా మనోవేదన నీకు తెలియడానికే ఈ ఉత్తరం రాసి భోషాణంలో పడేస్తున్నాను. ఎప్పటికైనా నువ్వు చదివి కొడుకు మారేడని ప్రయోజకుడయ్యాడని సంతోషిస్తావని ఆశిస్తాను.

ఇన్నాళ్ళుగా నువ్వెంత పోరినా వినని నేను ఒక్క రాత్రిలో ఎలా మారిపోయానా అని ఆశ్చర్యపోతున్నావమ్మా! మార్పుకి ఒక్క సెకండు చాలమ్మా! నువ్వాశించిన మార్పు ఇదేకదమ్మా!

బాధ్యత! నీకివ్వబోయే పరిహారమే నీ కొడుకు సంపాదించి తెచ్చి! జీతమనుకోమ్మా!

అమ్మా! ఈ విషయం నీ గుండెల్లోనే దాచుకో. కొడుకు శరీరాన్ని దహనం చేసినట్లే ఆ నిజానికీ సమాధి కట్టేయమ్మా! ప్లీజ్!

నిద్ర వస్తున్నట్లుగా ఉంది. ఉంటాను మరి.

అయినా శాశ్వత నిద్రలో హాయిగా ఉండబోతూ ఈ నిద్రకి ఆరాటమెందుకో! సెలవు.

నీ కొడుకు

శ్రీరామ్

శాంతమ్మ కన్నీటికి రంగు ఒక్కటే లోపించింది. ★


<u>రచయిత్రి చిరునామా:</u>

టి.పి.హేమమాలిని,

మిడిల్ స్ట్రీట్, సింహాచలం- 530 028.


ఆమె అదృష్టమో! ఏమో! రెండేళ్ళుగా లేని డిఎస్సీ ఆ ఏడాది నిర్వహించారు. ఆ డిఎస్సీలో వసంత సెలక్టయింది. శాంతమ్మ ఆనందానికి అవధులు లేవు. వసంతకు తూర్పు గోదావరి జిల్లాలో పోస్టింగ్ వచ్చింది. పోస్టుల సంఖ్యనిబట్టి ఆమె అక్కడే పరీక్ష రాసింది.



ఇంటి వైద్యం

★ మహారస్నాదిక్వాథము 20 మి.లీ. ఉదయం-సాయంత్రం సేవిస్తే పక్షవాతం తగ్గుతుంది.